
విలేకరులు కావలెను
'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు, మండలాలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మండల విలేకరులు కావలెను.
98498 39560

Cell : 98498 39560
RNI.No : APTEL/2021/80994
Dare to Write... Dare to fight

# వజ్రభారతి

vajrabharathi@gmail.com
ఎడిటర్ : పమ్మి ఏడుకొండలు
సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక




సంపుటి : 5 సంచిక : 149 ఎడిటర్ : పి.ఏడుకొండలు వెల : 2 రూపాయిలు తేదీ: మంగళవారం 26-5-2026 పేజీలు : 8 E-mail:vajrabharathi@gmail.com




# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

ఆగని పెట్రో బాదుడు..

పెట్రోల్‌పై లీటరుకు రూ. 2.61,

డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంపు

11 రోజుల్లో నాలుగోసారి వడ్డన

మొత్తంగా రూ.7.5 పెరిగిన ధర

కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల ఫైర్

న్యూఢిల్లీ, మే 25 : ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున సోమవారం ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పద్మశ్రీ పురస్కారాలు స్వీకరిస్తున్న తెలంగాణకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి. వరుసగా యూజీసీ మాజీ చైర్మన్ మామిడాల జగదీశ్, ప్రముఖ ఆంకాలజిస్ట్ విజయ్ ఆనంద్ రెడ్డి, ప్రముఖ వైద్యులు జీ వెంకట్ రావు.

# చిప్ నుంచి షిప్ వరకు... ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం

2లో



టెక్నాలజీతో ఏపీని వేగంగా ముందుకు తీసుకెళతామన్న సీఎం చంద్రబాబు

- అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం
- 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వెల్లడి
- చిప్ నుంచి షిప్ వరకు తయారీపై దృష్టి సారించామని స్పష్టం

టెక్నాలజీని అనుసంధానం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని,

# వడదెబ్బతో 49 మంది మృతి

మృతుల్లో నాలుగేళ్ల బాలుడు, ఆర్టీసీ కండక్టర్

ధాన్యం కొనుగోలు కేంద్రంలో కుప్పకూలి ప్రాణాలు విడిచిన రైతు



2లో

# గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

కమీషన్ల కోసం జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధించిందన్న అచ్చెన్నాయుడు

నాకెంత.. నీకెంత అంటూ దోచుకున్నారని విమర్శ

కూటమి ప్రభుత్వంలో రూ. 23 లక్షల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి

# ఒక్కటైనా కట్టారా?




2లో

# రైతు గోస పట్టదా?

రైతుల ఇబ్బందులు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి

'రైతుగోస-- బీజేపీ భరోసా'లో రాంచందర్‌రావు



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి రైతుల గోస పట్టడం లేదని, పండించిన పంటను అమ్ముకోలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో సోమవారం 'రైతుగోస-- బీజేపీ భరోసా'కార్యక్రమాన్ని ప్రారంభించి, మార్కెట్ యార్డులోని రైతులతో మాట్లాడారు. ఆ తర్వాత సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్ యార్డును కూడా సందర్శించి రైతులతో మాట్లాడారు. వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ఏనాడో మర్చిపోయిందన్నారు. రియల్‌ఎస్టేట్ దందా తప్ప క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎలా జరుగుతుందో సీఎంకు తెలియదన్నారు. ఇప్పటివరకు ఆయా జిల్లాల వారీగా ఎంతమేర ధాన్యం సేకరించారో శ్వేతపత్రం విడుదల చేయాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి

2లో

# మెగా డీఎస్సీనా? దగా డీఎస్సీనా?

- సీఎం చంద్రబాబుపై మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం
- ఉద్యోగార్థులను మోసం చేయటం దగా కాదా?
- మా హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం
- కొత్త నోటిఫికేషన్‌తో పబ్లిసిటీ స్టంట్ చివరకు స్కామ్‌లతో ముగిసిన మీ నిర్వాకం
- మొదటి ర్యాంకు వచ్చిన అభ్యర్థి వివరాలు డేటా బేస్ నుంచి ఎందుకు డిలీట్ చేశారు?
- సెలెక్టివ్ గా కొందరికి మాత్రమే మెసేజ్‌లు ఎందుకు పంపారు?
- ఎంపికైన వారి జాబితా ఎందుకు ప్రదర్శించలేదు?
- స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలకు రూ.15 లక్షలతో బేరాలా?
- మీ పార్టీ నేతే ఈ డీల్స్ చేయటం వాస్తవం కాదా?

2లో

అమరావతి: సీఎం చంద్రబాబు సర్కార్ నిర్వహించిన డీఎస్సీ--2025 పరీక్షలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "ఇది మెగా డీఎస్సీనా? లేక ఉద్యోగార్థులను మోసం చేసిన దగా డీఎస్సీనా? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పూర్తిగా లోపించిందని ఆక్షేపించిన మాజీ సీఎం వైఎస్ జగన్, పేపర్ లీకులు, డేటా డిలీట్లు, మెరిట్ లిస్టుల మాయం వంటి ఘటనలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తమ హయాంలో ఇచ్చిన డీఎస్సీని రద్దు చేసి, ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసి, కొత్త నోటిఫికేషన్‌ను ప్రచారానికి వాడుకున్నారని విమర్శించారు. నారా లోకేశ్‌ని మంత్రి పదవి నుంచి తప్పించి ... మెగా డీఎస్సీని స్కాంపై సీబీఐ దర్యాప్తు కోరాలన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా సోమవారం సీఎం చంద్రబాబు సర్కార్ తీరును ఎండగడుతూ వైఎస్ జగన్ పోస్టు చేశారు.





# రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

సీపీఎం నేతలతో జరిగిన భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

2లో

సీపీఎం నాయకులతో సమావేశంలో సీఎం వ్యాఖ్యలు

కనీస వేతనాల సవరణ చట్టంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపిన సీపీఎం బృందం

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం...

ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గం మొత్తం రద్దు

ప్రకాశం జిల్లా జనసేన కమిటీని రద్దు చేసిన పవన్

వర్గ విభేదాలు, క్రమశిక్షణారాహిత్యమే కారణమని వెల్లడి

25 మంది సభ్యుల మధ్య 54 గొడవలు ఉన్నాయని వ్యాఖ్య

ఇకపై పార్టీలో కఠినంగా వ్యవహరిస్తానని స్పష్టం

# ఒక్కటైనా కట్టారా?

(మొదటి పేజీ తరువాయి)

కూకట్‌పల్లి (హైదరాబాద్): అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా.. హైదరాబాద్ నగరానికి కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అనేక ఫ్లై ఓవర్లు మొదలుకుని టిమ్స్ ఆసుపత్రి దాకా ప్రతి ఒక్కటీ తామే నిర్మించామని, ప్రస్తుతం వాటికే సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్ చేస్తూ తామే నిర్మించామని చెప్పుకుంటున్నారని ధ్వజమెత్తారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరానికి ఒక్కటంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేని అసమర్థ ప్రభుత్వం అని మండిపడ్డారు. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించినట్టు నిరూపించినా రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. సోమవారం కూకట్‌పల్లిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

**కాంగ్రెస్ మోసం చేసింది..**

'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం అభివృద్ధి పైనే దృష్టి పెట్టాం. తెలంగాణకు 24 గంటల కరెంటు, తాగునీటిని అందించింది కేసీఆరే. కానీ అసెంబ్లీ ఎన్నిలప్పుడు అడ్డగోలుగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రతి వర్గాన్ని మోసం చేసింది. ప్రభుత్వ విధానాలతో హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు, సెంట్రింగ్ కార్మికులకు ఉపాధి లభించకుండా పోయింది. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ, సెంట్రింగ్ కార్మికుల కోసం బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం. నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటలు తాగునీటిని సరఫరా చేస్తాం. ఈ బాధ్యత నేనే తీసుకుంటా..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

(మొదటి పేజీ తరువాయి)



గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉండగా 'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించి ఉక్కు పరిశ్రమను కాపాడారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించామని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల స్థాపన అవసరమన్న ఆయన... నియోజకవర్గ తాగునీటి సమస్యకు రూ.620 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రజల 60 ఏళ్ల కల అయిన 'నేరడి బ్యారేజీ'ని 2029 నాటికి వంద శాతం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# వడదెబ్బతో 49 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బకు గురయ్యే వారి సంఖ్యా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో 49 మంది చనిపోయారు. వరంగల్ జిల్లా బుధరావుపేటలో గుండ్రపల్లి సదయ్య (58), ధర్మారంలో అంకేశ్వరపు సమ్మక్క (70), దమ్మన్నపేటలో అనసూర్య (68), ఖిలా వరంగల్ పడమరకోటలో బొల్లం వీరమల్లు (68), మొండ్రాయిలో తండ చేరాలు (75), పుల్లయబోడులో భూక్య నరేశ్ (29), సర్వాపురానికి చెందిన మండల వీరయ్య (74) వడదెబ్బతో మృతిచెందారు. పరకాల డిపోనకు చెందిన కండక్టర్ బి.శంకర్ (48) విధుల్లో భాగంగా భద్రాచలం నుంచి పరకాల బయలుదేరి కొత్తగూడెం దాటిన తర్వాత అనిశెట్టిపల్లి వద్ద వేడిగాలితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలిస్తుండగానే ప్రాణం కోల్పోయాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నగరంపల్లిలో గొర్రెలకాపరి కోడారి సాంబయ్య(52), అంకుషాపూర్‌లో వ్యవసాయ కూలీ మహమ్మద్ సైద్‌ఖాన్ (42), జనగామ జిల్లా రంగరాయగూడెంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అదే గ్రామానికి చెందిన రైతు నెలమంచ ఎలేందర్‌రెడ్డి (39) ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై చనిపోయాడు. శివునిపల్లికి చెందిన పిట్టల శంకర్--రవళి దంపతుల కుమారుడు అక్షిత్ (4) ఎండ తీవ్రతతో మృతి చెందాడు. ఘన్‌పూర్‌లో తాటికొండ నర్సమ్మ(65), కామారపు విజయ్ (60), వరంగల్ జిల్లా ఇటుకాలపల్లిలో కూలీ నైనబోయిన రాజు(44) హనుమకొండ జిల్లా నీరుకుళ్లలో మేస్త్రీ వద్ద పనిచేసే కూలీ వడదెబ్బతో చనిపోయాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పెయింటర్ కొమిరె రమేశ్ (39), బైపాస్‌రోడ్డులో ఉండే యాచకుడు షేక్ లతీఫ్ (50), ములుగుకు చెందిన బీజేపీ నేత అన్నపురెడ్డి ప్రమోద్‌రెడ్డి (49), కమలాపురంలో అన్నపు రెడ్డి లక్ష్మీబాయి (80), తిరువాయిపేట వెంకటరమణ (48), తాడి సత్యవతి (80) వడదెబ్బతో చనిపోయారు.

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం...

(మొదటి పేజీ తరువాయి)

జనసేన పార్టీలో తన పుష్కర కాలం నాటి సహనానికి స్వస్తి పలుకుతున్నానని, ఇకపై పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీని ఒక సైనిక పటాలంలా ముందుకు నడిపించేందుకు కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేశారు. రాజమండ్రిలో జరిగిన పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో ప్రక్షాళనకు శ్రీకారం చుదుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. దీనికి తొలి అడుగుగా, అంతర్గత కలహాలతో సతమతమవుతున్న ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రకాశం జిల్లా కమిటీలో తీవ్రమైన



వర్గ విభేదాలు ఉన్నాయని, కేవలం 25 మంది సభ్యుల మధ్య ఏకంగా 54 గొడవలు ఉన్నాయని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత కలహాలతో ఒకరినొకరు పనిచేయనివ్వకుండా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో ఇలాంటి క్రమశిక్షణారాహిత్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పార్టీలో అందరికీ స్వేచ్ఛ ఇచ్చానని, కానీ ఇకపై తాను అనుకున్న పద్ధతిలోనే పార్టీని ముందుకు నడిపిస్తానని తేల్చిచెప్పారు. "ఒకే మార్గంలో నడవండి, లేదంటే పక్కకు తప్పుకోండి (ఫాల్ ఇన్ లైన్ ఆర్ ఫాల్ అవుట్ ఆఫ్ లైన్)" అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో ఏ స్థాయి నేతలైనా క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తప్పవనే బలమైన సందేశాన్ని పవన్ పంపించారు. త్వరలోనే ప్రకాశం జిల్లాకు కొత్త కార్యవర్గాన్ని నియమించనున్నట్లు సమాచారం.

# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

నుంచి రూ. 95.20కి పెరిగింది. ఇంధన ధరలు 2022 మే తర్వాత ఇంత అత్యధిక స్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరువడానికి అమెరికా, ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిన తర్వాత ప్రపంచ చమురు ధరలకు ప్రాథమిక ప్రమాణమైన బెరట్ క్రూడ్ 5 శాతానికి పైగా పడిపోయింది. ఇరాన్ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, అలాగే కీలకమైన ప్రపంచ చమురు రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానానికి అంతరాయం కలుగడంతో ఫిబ్రవరి నెలాఖరు నుంచి ప్రపంచ ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి గృహోపయోగ వంటగ్యాస్ ధరను 14.2 కిలోల సిలిండర్ రూ. 60, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ) ధరను మే మధ్య నుండి కిలోకు రూ. 4 చొప్పున పెంచారు.

పెట్రోల్, డీజిల్ ధరల తాజా పెంపుపై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై సోమవారం దాడిని కొనసాగించాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు నిలకడగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఇంధన ధరలను పదేపదే పెంచడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇంధన లూటీని కొనసాగిస్తున్నదని ఆయన ఆరోపించారు. సామాన్య ప్రజల పొదుపు మొత్తాలను దగ్ధం చేసేందుకు మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లిందని ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్క డాలరు కూడా పెరుగలేదని ఆయన చెప్పారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం 2014లో రూ. 71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను 2026 నాటికి రూ. 102.71కి పెంచిందని ఖర్గే చెప్పారు. అదే విధంగా లీటర్ డీజిల్ ధరను రూ. 56.71 నుంచి రూ. 95.20కి చేర్చిందని చెప్పారు. రష్యా, ఇరాన్ నుంచి తక్కువ ధరలకు ముడి చమురును ఎందుకు భారత్ కొనుగోలు చేయడం లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు.

**పీఎన్‌జీ ఉంటే ఎల్పీజీ బంద్**

పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) వినియోగదారులు ఇకపై ఎల్‌పీజీ సిలిండర్లను కొనుగోలు చేయకూడదని భారత ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం తలెత్తడంతో, ప్రభుత్వం కొన్ని పరిశ్రమలకు ఎల్‌పీజీ సరఫరాను ఇప్పటికే నిలిపివేసింది.

మే 15న లీటర్‌కు రూ.3 చొప్పున తొలిసారిగా రిటైల్ ఇంధన ధరలను పెంచగా ఆ తర్వాత మే 19న 90 పైసలు, మే 23న పెట్రోల్ ధరలు 87 పైసలు, డీజిల్ ధరలు 91 పైసలు లీటర్‌కు పెరిగాయి. స్థానిక పన్నుల కారణంగా రాష్ట్రాలవారీగా ధరలు మారుతూ ఉంటాయి. సోమవారం పెంపు తర్వాత ముంబైలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 111.21, డీజిల్ ధర రూ. 97.83గా ఉండగా, కోల్‌కతాలో ధరలు వరుసగా రూ. 113.51, రూ. 99.82కి పెరిగాయి. చెన్నైలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 107.77, డీజిల్ ధర లీటర్‌కు రూ. 99.55గా ఉంది.

# మెగా డీఎస్సీనా? దగా డీఎస్సీనా?

(మొదటి పేజీ తరువాయి)

డీఎస్సీనా? లేక ఉద్యోగార్థులను మోసం చేసిన దగా డీఎస్సీనా? పారదర్శకత ఎక్కడ ఉంది? పేపర్లు లీక్.. డేటా డిలీట్.. మెరిట్ లిస్టు మాయం.. దీనిపై మీ సమాధానం ఏమిటి? మా హయాంలో ఇచ్చిన డీఎస్సీని రద్దుచేసి, ఉద్దేశ పూర్వకంగా ఆలస్యంచేసి, కొత్తగా మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి, దాన్ని పబ్లిసిటీకి వాడుకుని, తీరా పరీక్షల్లో మీరు చేసిన నిర్వాకాలు, స్కాంలతో ఉద్యోగార్థులకు ద్రోహం చేయలేదా?. దీనికేమి సమాధానం చెబుతారు? మీ సుపుత్రుడి శాఖలో లీకులతో సాగిన 'డార్క్ ఆపరేషన్'ను ఎందుకు దాచిపెడుతున్నారు?. పరీక్ష నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న ఎస్‌సీఈఆర్‌టీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చింది? ఆ తర్వాత ఆ వివరాలను డేటాబేస్ నుంచి ఎందుకు డిలీట్ చేశారు? మెరిట్ లిస్టులను ఎందుకు దాచారు? టాపర్ వివరాలను ఎందుకు తొలగించారు? సెలెక్ట్ అయిన వారికి మాత్రమే నేరుగా మెసేజ్‌లు ఎందుకు పంపారు? కలెక్టర్ కార్యాలయాల్లో ఎంపికైన వారి జాబితాలు ఎందుకు పెట్టలేదు? రూ.15 లక్షలకు "స్పోర్ట్స్ కోటా" పోస్టుల బేరసారాలా? మీ పార్టీకి చెందిన నాయకుడే ఈ డీల్స్ కుదిర్చిన మాట వాస్తవం కాదా? ఎప్పుడూ క్రీడా మైదానంలో అడుగు పెట్టని వాళ్లకి కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చిన మాట వాస్తవం కాదా? ఇంటికే పిలిచి డీల్స్ చేస్తారా? రిక్రూట్‌మెంటా? లేక వేలం పాటా? ప్రతిభ ఉన్న ఉద్యోగార్థుల మాటేమిటి? టెట్ కన్వీనర్‌గా ఉన్న అధికారే డీఎస్సీ పరీక్షకూ కన్వీనర్ అయినప్పటికీ, ఉన్నపళంగా టెట్ కన్వీనర్‌ను తొలగించి విద్యా శాఖలోని జాయింట్ డైరెక్టర్‌ను డీఎస్సీ కన్వీనర్‌గా ఎందుకు పెట్టారు? దీనివెనుక మతలబు ఏమిటి? మెగా డీఎస్సీ.. మెగా లీక్.. మెగా అవినీతి.. దీనికి బాధ్యత వహిస్తూ లోకేష్ ను పదవి నుంచి తప్పించి వెంటనే సీబీఐ దర్యాప్తు కోరాలి. చంద్రబాబూ..! మీలో ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రతిభ చూపిన అభ్యర్థులకు న్యాయం చేయాలి.

# చిప్ నుంచి షిప్ వరకు... ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం

యువతకు అపార అవకాశాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీపై ఆధారపడి ఉందని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా మారుస్తామని, క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. యువత, విద్యాసంస్థలు ఈ నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నాన్ని ప్రపంచానికే డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. స్టీల్, అల్యూమినియం, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి నుంచి బెంగళూరు వరకు డిఫెన్స్ కారిడార్‌గా, రాయలసీమను రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల టెస్టింగ్ ఫెసిలిటీని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యలంక, గండికోట వంటి పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, పరిశ్రమలు వాస్తవ రూపంలో కార్యకలాపాలు ప్రారంభించేలా చూస్తున్నామని, 'సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని పునరుద్ఘాటించారు. గత 23 నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు.

# రైతు గోస పట్టదా?

ఉండగా, ఇప్పటివరకు కేవలం 45 లక్షల టన్నులు సేకరించామని సీఎం పేర్కొంటున్నారని తెలిపారు. ఈ లెక్కన కూడా 30 శాతం మించలేదని మండిపడ్డారు.బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కాకుండానే, వారంలో కేంద్రాలను మూసేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని మండిపడ్డారు. అలా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ బీజేపీ బస్సు యాత్ర వస్తుందని తెలిసి...కలెక్టర్ ఆదివారం గజ్వేల్ మార్కెట్ యార్డుకు ఆగమేఘాల మీద చేరుకొని లారీలు , గన్నీ బ్యాగులు తెప్పించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఇదే ప్రయత్నం నిరంతరంగా ఎందుకు సాగటం లేదని ప్రశ్నించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలనకు ఐక్యతను చాటుతూ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు బస్సులో బయలుదేరారు. ఈ బస్సు యాత్రలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యానారాయణగుప్తా, డా.పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, డా.సి.చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

హైదరాబాద్: రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రం మద్దతు ధరలు ప్రకటిస్తున్నప్పటికీ పంటలను మాత్రం పూర్తిస్థాయిలో కొనడం లేదని అన్నారు. సోమవారం సచివాలయంలో సీపీఎం రాష్ట్ర నాయకులు.. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నేతృత్వంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పండిన పంటలో 30 శాతం కూడా సేకరించడం లేదని విమర్శించారు. పంట కొనుగోళ్ల విషయంలో కేంద్రాన్ని ప్రశ్నించాలని వారికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తోందన్నారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందని, ఎండ తీవ్రత వల్ల మధ్యాహ్న సమయంలో పనులు మందగిస్తున్నాయని పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులకు అక్కడే ఇళ్లు..: కాగా, మూసీ నిర్వాసితులకు స్థానికంగానే ఇళ్లు మంజూరు చేస్తామని సీపీఎం నేతలకు సీఎం హామీ ఇచ్చారు. మూసీ అంశంపై బీఆర్ఎస్, బీజేపీ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, ఈ ప్రాజెక్ట్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

## వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో బాలాజీ చౌక్ సెంటర్లో మజ్జిగ పంపిణీ



**ఏలేశ్వరం,వజ్రభారతి,ప్రతినిధి,మే,25:-** ఏలేశ్వరం పట్టణంలో బాలాజీ చౌక్ సెంటర్లో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు సూచనలతో సంస్థ సభ్యులు,కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పుట్టినరోజు సందర్భంగా దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు మీడియాతో మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివేకానంద సేవాసమితి సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈరోజు మజ్జిగ పంపిణీకి ఆర్థిక సాయం అందించిన దాతలు శ్రీనివాస ట్రేడింగ్ కు అధినేత అంబటి రామకృష్ణ,శ్రీదేవి, పని కృష్ణ ఎంటర్ప్రైజెస్ అధినేత దొరారెడ్డి, మిరాకిల్ మినిస్ట్రీస్ అధినేత ప్రవీణ్ పాల్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి త్రిమూర్తులు,వాగు రాజేష్, అనంతరం రాజు,మామిడి లలిత,శ్రీను,రాతికింద సతీష్,జుత్తుల శ్రీను,బుగతా శ్రీను,వివేకానంద సేవా సమితి సభ్యులు అడపా శివప్రసాద్, పెంద్యాల రాజు,సునీల్,డేవిడ్,రాజబాబు,రాజశేఖర్, నాని తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ విప్ ఐలయ్యకు స్వాగతం పలికిన ఉమ్మిడి



**ఏలేశ్వరం,వజ్రభారతి,ప్రతినిధి,మే, 25:-** ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఏలేశ్వరంలో స్వగృహానికి విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలియ్య కు పుష్పగుచ్చం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ పెళ్లిరోజు సందర్భంగా అన్నవరం శ్రీ సత్యనారాయణమూర్తి దర్శనం నిమిత్తం రావడం జరిగిందని, ప్రతిపాడు నియోజకవర్గ ఇన్చార్జి ఉమ్మిడి వెంకట్రావును కలిసి అన్నవరం బయలుదేరడం జరుగుతుందన్నారు. అలాగే కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి వెంకట్రావు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విప్ ఇలియ్య పెళ్లిరోజు సందర్భంగా అన్నవరం సత్యదేవుని దర్శనానికి రావడం జరిగిందని,మా ఆతిథ్యాన్ని స్వీకరించి రాత్రి కి అన్నవరంలో బస చేసి ఉదయం దర్శనం అనంతరం తెలంగాణ బయలుదేరి వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దొంతంశెట్టి చంద్రశేఖర్,వీరబాబు,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో దివంగత బొదిరెడ్డి సూర్యారావు వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

### బొదిరెడ్డి గోపి యువసేన ఆధ్వర్యంలో కార్యక్రమాలు

### ముఖ్య అతిథులగా జ్యోతుల పెదబాబు,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం,వజ్రభారతి,ప్రతినిధి,మే,25:- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం పట్టణంలో దివంగత బొదిరెడ్డి సూర్యారావు 13వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు,యువ నాయకుడు బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గోపి యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి,టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మజ్జిగ పంపిణీ చేయడంతో పాటు బాలింతలు,రోగులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బొదిరెడ్డి గోపి మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ బొదిరెడ్డి సూర్యారావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే మృతదేహాల భద్రపాటుకు ఉపయోగపడే సుమారు రూ.50 వేల విలువైన ఫ్రీజర్‌ను ఏలేశ్వరం స్మశాన వాటికకు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దనేకుల భద్రం,వాగు రాజేష్, అనంతారపు రాజు,ఎండగుడి నాగబాబు,మామిడి లలిత,పతివాడ అఖిలేష్,కిలారి రామచంద్రరావు,జిత్తుక శ్రీను, శంఖాని బాబ్జి,రాతిక్రింది సతీష్,గొల్లపూడి త్రిమూర్తులు,కరోతు గాంధీ,బుర్ల అప్పలరాజు,సుంకర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.





## ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

# 'ఎస్ఐఆర్' అవగాహన సదస్సు





**శంఖవరం వజ్రభారతి ప్రతినిధి.ముఖే. వీరబాబు మే :- 25 :** గౌరవ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరం ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ లో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ ) మరియు ప్రజాప్రతినిధులకు 'ఎస్ఐఆర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా కాకినాడ పార్లమెంట్ అధ్యక్షులు దాట్ల సూర్యనారాయణ రాజు కాకినాడ జిల్లా టాస్క్ ఫోర్స్ హెడ్ బి.వి. చౌదరి ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు మరియు టాస్క్ ఫోర్స్ సభ్యులు వమ్మి రఘురాం తుని నియోజకవర్గ పరిశీలకులు మరియు టాస్క్ ఫోర్స్ సభ్యులు వాసిరెడ్డి జగన్నాథం (జమీల్) ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ నాయకులకు బిఎల్ఏలకు, ప్రజాప్రతి నిధులకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సుకు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ బిఎల్ఏలు, ప్రజాప్రతినిధులు మరియు మండల కన్వీనర్ నరాల శ్రీనివాస్ మాజీ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా అన్నవరం టౌన్ ప్రెసిడెంట్ ఆసిన శ్రీనివాస్ ప్రత్తిపాడు నియోజకవర్గ పబ్లిక్ వింగ్ చైర్మన్ సరమర్ల మధుబాబు గణేశుల బాబ్జి సింగంపల్లి రాము రాయి శ్రీనివాస్ బలువు హరిబాబు ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి, కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారు.

## వరుపుల సత్య ప్రభ రాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అన్నవరం టిడిపి నాయకులు

**శంఖవరం వజ్రభారతి ప్రతినిధి. ముఖే.వీరబాబు మే :- 25** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా జన్మదిన వేడుకలు అన్నవరంలో స్థానిక ఎస్.ఏ. ఎల్. రెసిడెన్సిలో టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముందుగా ఎమ్మెల్యే కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నియోజకవర్గ ప్రజల ఆశాజ్యోతి. అభివృద్ధి ప్రదాత మన ప్రియతమ ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా జన్మదినం ఈ శుభదినం సందర్భంగా మా తరపున మరియు మా నాయకులందరూ తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు పేదలకు అండగా నిలవడం వైద్య విద్య మరియు మౌలిక వసతులు కల్పనలో వారు చూపిస్తున్న చొరవ ఎంతో గొప్పది మన నియోజకవర్గ ప్రాంతమంతా



ఇంతలా అభివృద్ధి చెందుతుంది అంటే అవిశ్రాంతి శ్రమ కారణం రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే చేపట్టబోయే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి మనమంతా అండగా నిలవాలని కోరుకుంటున్నామన్నారు అనంతరం నాయకులు మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు సత్యదేవుని సన్నిధిలో తొలి పావంచాలి వద్ద కొబ్బరికాయ కొట్టి



ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ టౌన్ ప్రెసిడెంట్ వీర్ల సూరిబాబు మాజీ ఎంపీపీ బొమ్మిడి సత్తిబాబు రాజాల చిట్టిబాబు మద్దు వీరబాబు పలివేల సతీష్ బండారు సురేష్ గాంద్రెడ్డి వెంకటరమణ బాదిరెడ్డి ప్రసాద్ కందిపల్లి నేరిబాబు మత్తల మరిదయ్య నంబారు అర్జున్ బొడ్డు శ్రీను నక్క రాజ్ కుమార్ రాజాల యాదిద్య రాఘవ శాస్త్రి తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు

## వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ పంపిణీ

**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 25:-** స్థానిక గోకవరం రోడ్డులోని పెన్షనర్స్ భవనం వద్ద బాటసారులు, ప్రయాణికుల సౌకర్యార్థం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ జగ్గంపేట అధ్యక్షుడు పొట్టి వీర్రాజు అలియాస్ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా తోలేటి సూర్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చెట్ల పెంపకం తగ్గిపోవడం, ప్లాస్టిక్ వినియోగం పెరగడం, వాహనాల వినియోగం అధికమవడం వల్లే ప్రతి సంవత్సరం ఎండ తీవ్రత పెరుగుతోందన్నారు. భవిష్యత్తులో మరింత తీవ్రమైన వడగాల్పులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు చెట్లు నాటాలని, ప్లాస్టిక్ సంచుల బదులు చేతి సంచులు ఉపయోగించాలని, పక్షులు, జంతువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాదచారులు, వాహనదారులు, ప్రయాణికులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పొట్టి రాజేష్, క్యాబినెట్ సెక్రటరీ ఎం. మల్లేశ్వరరావు, కోశాధికారి వెత్సా నాగసత్య, జోనల్ చైర్‌పర్సన్ ముమ్మిడివరపు సురేష్, పుర్రె సూరన్న, కొత్త నాగపండు తదితరులు పాల్గొన్నారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని జగ్గంపేట వాకర్స్ హెల్త్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్త కొండబాబు సౌజన్యంతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.





## వాతావరణ ఆధారిత పంటల సాగు ఉత్తమం

### వ్యవసాయ అధికారి పి.గాంధీ

**శంఖవరం వజ్ర భారతి ప్రతినిధి ముఖే.వీరబాబు మే :- 25:** ఈ తొలకరి పంట కాలంలో ఎల్నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నశీదున రైతులు పంటల సాగు ప్రణాళికలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తంలో భాగంగా జి కొత్తపల్లి,గౌరంపేట పరిధిలోని గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి తొలకరి పంటల సాగులో భాగంగా వేసవి దుక్కులు అవశ్యకత, పి ఎం డి ఎస్ విత్తనాల ప్రాధాన్యత,వరిలో రకాలు,పంటల భీమా పథకం,పంట నమోదు,కౌలు పత్రాల అవశ్యకత,ఆరుతడి పంటల సాగు,ఎరువుల వాడకం, రాయితీపై యంత్ర పరికరాలు,ఉద్యాన పంటల సాగు మరియు రాయితీలు,రాయితీపై పశు గ్రాస విత్తనాలు వంటి అంశాలపై చర్చించారు. ఏ ఈ ఓ శ్రీనివాస్, సెక్రటరీ , ఉద్యాన,పశువైద్య సహాయకులు శ్యామ్ సుందర్,సత్యనారాయణ, భవాని,గ్రామ పెద్దలు,రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## ఇర్రిపాకలో డిజిటల్ మహానాడు విజయవంతానికి టీడీపీ నేతల సమాయత్తం

**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 25:-** ఇర్రిపాక క్లస్టర్--8 పరిధిలో నిర్వహించనున్న డిజిటల్ మహానాడును విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు సమాయత్తమయ్యారు. రావులమ్మ నగర్ కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్ బస్వా చిన్నబాబు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్వా చిన్నబాబు మాట్లాడుతూ, టీడీపీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు ఈసారి మహానాడును క్లస్టర్ స్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలు, టీడీపీ ఖ్యాతి మరింత విస్తరించేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. ఇర్రిపాక శివకేశవుల కళ్యాణ మండపంలో మే 27, 28 తేదీల్లో ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా వర్చువల్ మహానాడు ప్రత్యక్ష



ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. బలభద్రపురం, సగరపేట, గుర్రంపాలెం, గొల్లలగుంట, కాండ్రేగుల, భావారం, నరేంద్రపట్నం, మామిడాడ, ఇర్రిపాక, మర్రిపాక, రామవరం గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై మహానాడును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో క్లస్టర్ పరిధిలోని గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## రాజపూడిలో డిజిటల్ టీడీపీ మహానాడు విజయవంతం చేయాలి: పైడిపాల సూరిబాబు

**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 25:-** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక మహానాడు--2026ను ఈసారి డిజిటల్ రూపంలో రాజపూడిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మే 27, 28 తేదీల్లో రాజపూడిలోని చల్లా నాగేశ్వరరావు కళ్యాణ మండపంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. "ఇంధనం పొదుపు దేశానికి మేలు" అనే సందేశంతో వర్చువల్ విధానంలో ఈ మహానాడు నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. మల్లిశాల, వెంగయ్యమ్మపురం, రాజపూడి, కృష్ణాపురం, గోవిందపురం, మన్యంవారిపాలెం, సీతారామపురం, జె.కొత్తూరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఈ డిజిటల్ మహానాడును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. కాకినాడ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రేఖ బుల్లి రాజు మాట్లాడుతూ, టెక్నాలజీతో టీడీపీ వేస్తున్న కొత్త అడుగుగా ఈ మహానాడు నిలుస్తుందని, ప్రతి కార్యకర్త పండుగలా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి బుల్లెబ్బు, కొల్లి రామకృష్ణ, కే. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవ ఐక్య వేదికను విజయవంతం చేయాలి: కుండ జాన్ వెస్లీ



**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 25:-** ఈ నెల 26న జగ్గంపేటలో నిర్వహించనున్న దళిత క్రైస్తవ ఐక్య వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని క్రిస్టియన్ నాయకుడు కుండ జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమానికి ప్రముఖ నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ, మాజీ ఎంపీ హర్ష కుమార్, మాజీ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్, సుందర్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. దళిత క్రైస్తవుల హక్కులు, ఐక్యత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జుత్తుక నాగేశ్వరరావు, వల్లూరి సత్యానందం, శ్రీమంతుల భాస్కరరావు, కిషోర్, క్రిస్టఫర్, పండు తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

## డా విజయ కు మరొక సేవా పురస్కారం

**తాళ్లపూడి / ఏలూరు వజ్ర భారతి మే 25:** మేడే సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవలు అందిస్తున్న సేవా మూర్తులను అభినందిస్తూ విశ్వ జనని ఫౌండేషన్ చైర్మన్ బి బ్రహ్మానందం హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వేదికగా వారి సేవలను అభినందిస్తూ సేవా పురస్కారాలను అందచేశారు. ఈ కార్యక్రమం లో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ సేవ కార్యక్రమాలు చేస్తున్న ఏలూరు కి చెందిన డా. విజయ శ్రీ రొడ్డ (బుజ్జమ్మ) డా బి. ఆర్ అంబేద్కర్ సేవా పురస్కారాన్ని విశ్వ జనని ఫాండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం చేతులు మీదుగా అందుకున్నారు. పేదలు అనాధల మధ్య నిత్యం సామజిక సేవలో తరిస్తున్న బుజ్జమ్మ ఈ పురస్కారం అందుకోవడం అభినందనీయం అని నల్లజర్ల కి చేసిన మానవతా మూర్తి, సామజిక సేవా తత్పరుడు వసంతాడ ఆనంద్ స్వరూప్ తెలిపారు.




# వెంకన్న ఆలయం తమదే అంటున్న స్థల దాత

## అందరి విరాళాలతో నిర్మాణం, ఏ ఒక్కరికో పరిమితం కాదంటున్న చైర్మన్



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 25:** తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామం లో సంవత్సరం క్రితం నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయం వివాదాల నిలయంగా మారింది. దాతల పూర్తి సహకారం తో దాదాపు 30 లక్షల రూపాయల వ్యయం తో నిర్మించబడిన ఆలయాన్ని తనదేనని, ఎవరికి సంబంధం లేదని ఆలయ నిర్మాణ స్థల దాత నొప్పినీడి సాయి దంపతులు భక్తులు ఎవ్వరిని ఆలయం లోకి రాకుండా అభ్యతరం పెడుతున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల సత్యనారాయణ తదితర కమిటీ సభ్యులు ఆరోపించారు. మార్చి 2025 లో దాతలు వివిధ రూపాల్లో అందించిన దాతృత్వం తో ఆలయ నిర్మాణం జరిగిందని, ఆలయం తనది అని చెప్పుకుంటున్న కోప్పినీడి సాయి తను వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మిద్దాం, స్థలం ఇస్తాను, సహకారం అందిస్తే గుడి నిర్మిద్దాం అని చెప్పి, నేడు ఆలయం తన స్వంతం అంటున్నారని ఆరోపించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగాను, వివిధ సందర్భాలలోను వచ్చిన విరాళాలు దాచేసుకుంటున్నారని, ఇదేమి అని అడిగితే కోర్టు నుంచి తాకిధులు పంపి, తమ కమిటి పై కేసులు పెడుతున్నారని వారు తెలిపారు . సాయి దంపతులు స్థల దాతలు మాత్రమేనని, వచ్చిన విరాళాలు లెక్కలు చెప్పక మోసం చేస్తున్న నేపధ్యం లో ఆలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని, దాతలు ఇచ్చిన వాటికి లెక్కలు చెప్పాలని కోరారు. అధ్యక్షులు కాకర్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు దండముడి వెంకట సత్యనారాయణ, కార్యదర్శిగంగి రాజు కోటేశ్వర రావు, రాగు రాజేష్ బాబు, చెరుకూరి కృష్ణమూర్తి, కొల్లేపర నాగేశ్వర రావు,అంబటి వెంకటేశ్వరవు, అంబటి రాంబాబు తదితరులు హాజరయ్యారు.


## రాజమహేంద్రవరంలో పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికిన జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట/రాజమహేంద్రవరం,వజ్రభారతి,ప్రతినిధి, మే, 25:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అధికారిక పర్యటన నిమిత్తం రాజమహేంద్రవరం విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక హోటల్ షెల్టన్ వద్ద జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ రాక సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు స్వాగతం తెలిపారు. అభిమానుల నినాదాలతో హోటల్ పరిసర ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, ప్రజాసేవలో నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న పవన్ కళ్యాణ్ నాయకత్వం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

## ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు

### ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



**పోలవరం (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ మే 25:** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శ్రీ అనిమిని రవి నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ శ్రీమతి కొవ్వాసు జగదీశ్వరి దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తిరుపతిలోని తిమ్మనాయుడుపాలెంలో ఉన్న చైర్మన్ కార్యాలయానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర క్రీడా రంగ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. యువ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తూ క్రీడా రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని అభిలషించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడా శాఖ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు. జగదీశ్వరి దంపతులు మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి శాప్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనిమిని రవి నాయుడు నాయకత్వంలో రాష్ట్ర క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ ఎదుట పీఎం రహత్ స్కీమ్‌పై అవగాహన సదస్సు

### సిఐ బిఎస్ అప్పారావు,ఎస్సై లక్ష్మీకాంతం



**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,మే,25:-** ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం సాయంత్రం పీఎం రహత్ స్కీమ్‌పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ బిఎస్ అప్పారావు, ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం పాల్గొని స్కీమ్ ప్రయోజనాలపై వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 56 ప్రైవేట్,ప్రభుత్వ ఆసుపత్రుల్లో గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పథకం గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రతి సెంటర్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. అలాగే పత్రికలు,ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా కూడా ప్రజలకు సమాచారం చేరేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రోడ్డు ప్రయాణాల్లో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అధికారులు సూచించారు.



## గండేపల్లిలో పలు కుటుంబాలను పరామర్శించిన పోతుల మోహనరావు

**గండేపల్లి,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 25:-** గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు ఆదివారం గండేపల్లి గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన ఎలుగంటి నాగేశ్వరరావు తల్లి కుటుంబ సభ్యులను, అల్లాడి వెంకన్న తల్లి కుటుంబాన్ని, అలాగే టీడీపీ వీరాభిమాని నాళం దేవుడు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. బాధలో ఉన్న కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, ముంగర సూర్యారావు, పైల వెంకన్న, చిటికెల కన్నబాబు, వీరమల్ల సూరిబాబు, గరిగిపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేవంలో దొంగతనం కేసు నమోదు చేసిన పోలీసులు



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 25:** తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామం లో మెయిన్ రోడ్ సమీపం లో గల ఓ ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఆదివారం రాత్రి చోరీ సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో విలువైన బంగారం, వెండి తో పాటు నగదు పోగొట్టుకున్నట్లు సమాచారం. సుమారు 10 లక్షల రూపాయలు చోరీ జరిగినట్లు భాదితుడు మల్లికార్జున సమాచారం. గది మొత్తం చిందరవందరగా చేసి, బీరువా తలుపులు పగలు కొట్టి చోరీ దుండగులు చేశారు. తాళ్లపూడి పోలీసులు సంఘటనా ప్రదేశాన్ని సందర్శించారు. క్లూస్ టీమ్ వచ్చి పరిస్థితులు పరిశీలించారు.

## వేసవి తాపానికి చల్లని మజ్జిగ పంపిణీ



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 25:** తాళ్లపూడి మండలం ప్రక్కిలంక భక్తఅంజనేయ స్వామి ఆలయం వద్ద బాటసారులుకి, ప్రయాణికులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం ఎండ వేడిమి మరింత పెరగటం తో చల్లటి మజ్జిగ పంపిణీ చేశామని 1996 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తెలిపారు.



## తెలుగు తమ్ముళ్లు సమిష్టి కృషితో "మహానాడు"ను విజయవంతం చేయాలి: బొరగం శ్రీనివాసులు

### పోలవరంలో ఘనంగా మహానాడు సన్నాహక సమావేశం..

**పోలవరం మే 25(వజ్ర భారతి):** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే పసుపు సైనికుల పండుగ(మహానాడు)ను వర్చువల్ విధానంలో జరుపుకుంటున్న సందర్భంగా పోలవరం మండలం కేంద్రంలో పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన మండల పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలకు సోమవారం మహానాడు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు కార్యక్రమం నిర్వహణ పై చర్చించి తెలుగు తమ్ముళ్లకు బొరగం శ్రీనివాస్ దిశా నిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు, నాయకులు , కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేసి మహానాడు ను విజయవంతం చేయాలని బొరగం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలవరం మండల అధ్యక్షులు మంగిన కొండ, ఐటీడీపీ మండల అధ్యక్షులు కోడి శ్రీనివాస్, పార్టీ నాయకులు పాదం ప్రసాద్, పూడి వెంకట్రావు, నునకాని రాంబాబు, పీవీవి సత్యనారాయణ, జల్లేపల్లి నరసింహారావు, కుంజం సుభాషిని, డోకల నాగేశ్వరరావు, జల్లేపల్లి జితేంద్ర, సబ్బారపు శ్రీరామ్ మూర్తి, తెల్లం సూర్యచంద్రం, అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మురళీకృష్ణంరాజు





**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,మే,25:-** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ఇటీవల కన్నుమూసిన బొల్లు సుబ్బమ్మ, దొడ్డిపట్ల నాగరత్నం కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నాయకుడు, నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. మొదటగా బొల్లు నాగేశ్వరరావు తల్లి సుబ్బమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దొడ్డిపట్ల ప్రకాశ్‌రావు భార్య నాగరత్నం కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఆయన, బాధలో ఉన్న కుటుంబాలకు పార్టీతో పాటు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, కోలా తాతబాబు, దాడి పుత్తయ్య, దొడ్డిపట్ల కృష్ణ, సిద్ధ బాబ్జి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుంటే జరిమానా కాదు- హెల్మెట్‌నే అందించిన ట్రాఫిక్ పోలీసులు

### కల్పనా సెంటర్ వద్ద వినూత్న అవగాహన కార్యక్రమం

### రోడ్డు భద్రతపై వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల సూచనలు

**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,మే,25:-** హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించడం కాకుండా,కొత్త హెల్మెట్లు కొనిపించి వారి తలపై ధరింపజేస్తూ ట్రాఫిక్ 1 సీఐ ఎన్ రమేష్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు మంగళవారం కాకినాడ నగరంలోని కల్పనా సెంటర్ వద్ద ట్రాఫిక్-1 పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. "హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే అది మీ ప్రాణాలను కాపాడుతుంది" అనే నినాదంతో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి రూ. 1,000 జరిమానా విధించాల్సి ఉన్నప్పటికీ,వారికి కొత్త హెల్మెట్లు కొనిపించి ధరింపజేస్తూ ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ 1 సిఐ ఎన్ రమేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం,మైనర్లతో వాహనాలు నడిపించడం, బైక్ స్టంట్లు చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని తెలిపారు. అలాగే రెడ్ సిగ్నల్ పడినప్పుడు స్టాప్ లైన్ వెనుక వాహనాలు నిలపాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఆటోమేటిక్ ఫైన్ జనరేషన్ సిస్టమ్ ద్వారా ఈ-చలానాలు జారీ అవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



# బెంతుకుర్తి అబ్బాయి మృతి వైసీపీకి తీరని లోటు-ముదునూరి

## అంతిమయాత్రలో పాల్గొని పాడె మోసిన మురళీకృష్ణం రాజు





**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,మే,25:-** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల భర్త,వైసీపీ సీనియర్ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి అకాల మరణం చెందడం వైసీపీ పార్టీకి తీరని లోటని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మురళీ కృష్ణంరాజు అబ్బాయి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో స్వయంగా పాల్గొని పాడె మోసి తన అనుబంధాన్ని,మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ఘటన అక్కడున్న వారిని భావోద్వేగానికి గురి చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్బాయి పార్టీకి ఎంతోకాలంగా అంకితభావంతో సేవలందించిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఆ కుటుంబానికి పార్టీ తరఫున,వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,జువ్వల దొరబాబు,కోన బాబ్జి,తూపాటి బాబ్జి,నాగులపల్లి ఏసు,రాపా అప్పన్న తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కంపెనీలు ధరలు తగ్గించికొంటే సంఘానికి తెలియజేయాలి

## జై భారత్ క్షీరరామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గాంధీ భగవాన్ రాజు

**పాలకొల్లు,( వజ్ర భారతి) న్యూస్ మే 25:** ప్రాసెసింగ్ ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండకుండా రొయ్యల ధరలు తగ్గించి కొనుగోలు చేస్తే ఆ వివరాలు తమ దృష్టికి తీసుకురావాలని జై భారత్ క్షీరా రామ అక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ఆక్వా రైతులను కోరారు. ఆక్వా రైతు సంఘ ప్రతి నిధులు తో కలిసి సోమవారం స్థానిక విలేకరులతో గాంధీ భగవాన్ రాజు మాట్లాడారు. రొయ్యల 100 కౌంట్ ధర కిలో రూ. 230కి కొనుగోలు చేస్తామని ప్రాసెసింగ్ ప్లాంట్ యజమానులు హామీ ఇచ్చి కూడా రూ. 10 తగ్గించి కొనుగోలు చేయడం ఆక్వా రైతులను మోసగించడమేనని విమర్శించారు. అలా తగ్గించి కొన్నవారు ఉంటే వారి వివరాలు వెంటనే తెలియజేయాలని, ఒకవేళ ఏజెంట్లు ఉన్న వారి వివరాలు కూడా తెలియజేస్తే ఆ బిల్లులను బట్టి ప్రభుత్వానికి తెలియజేసి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని గాంధీ భగవాన్ రాజు తెలిపారు. కైకలూరు లో జరిగే ఆక్వా రైతు సదస్సుకు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని ఆయన కోరారు. రాష్ట్రం నలుమూలల ఆక్వా రైతు సంఘాలు ఆందోళనల లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ నెల 29న అమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఆక్వా రైతు సంఘ కన్వీనర్ల సమావేశానికి అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. బాగున్న చెరువుల ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరపడి తక్కువ రేటుకి పట్టుబడి చేయవద్దు అని భగవాన్ రాజు



రైతులకు విజ్ఞప్తి చేశారు. విలేకరులతో మాట్లాడిన వారిలో సంఘ ప్రతినిధులు మేడిది జాన్ డేవిడ్ రాజు, పెన్ మెచ్చ సత్యనారాయణ రాజు, మేక ఫణీంద్ర ప్రసాద్, ఎన్ సోమేస్వరరాజు, బాపిరాజు, చిన్న, ఈశ్వర్ రాజు తదితరులు వున్నారు.

# ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి

## ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి సొసైటీ డైరెక్టర్లు గా శివకృష్ణ, దాసు, రాణి ప్రమాణ స్వీకారం.

**భీమవరం, వజ్రభారతి, మే 25:** ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి డైరెక్టలు కృషి చేయాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి సొసైటీ డైరెక్టర్లు గా యర్రంశెట్టి శివకృష్ణ, సుంకర దాసు, కొనాల దొర్కా రాణి, డాక్టర్లు, అధికారులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ గా ఎమ్మెల్యే అంజిబాబు వ్యవహరిస్తున్నారు. నూతనంగా నియమితులైన డైరెక్టర్లతో ఎమ్మెల్యే అంజిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రభుత్వాసుపత్రి క్షేత్ర స్థాయిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, వసతులను స్వయంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం





అందించేలా ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. 11 మంది సభ్యులతో అభివృద్ధి సొసైటీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, సభ్యులు నిరంతరం అందుబాటులో ఉంటూ ఆసుపత్రి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. దాతలను సమీకరించి ఆసుపత్రికి కావలసిన సదుపాయాలను సమకూర్చాలన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి సొసైటీ డైరెక్టర్లు యర్రంశెట్టి శివకృష్ణ, సుంకర దాసు, కొనాల దొర్కా రాణి లను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, కూటమి పార్టీ రాష్ట్ర నాయకులు, కూటమి పార్టీ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# శెట్టిబత్తుల వీరబాబు ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే సత్యప్రభ జన్మదిన వేడుకలు

### ముఖ్య అతిథులుగా కొమ్ముల కన్నబాబు,యాళ్ల జగదీష్

### 200 మందికి పైగా పేద మహిళలకు చీరల పంపిణీ

### బాటసారులకు,ప్రయాణికులకు చెరుకు రసం పంపిణీ

**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,మే,25:-** ప్రతిపాడు నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత,ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా జన్మదిన వేడుకలు ప్రతిపాడు గ్రామంలోని అంబేద్కర్ కళామందిర్ సెంటర్లో సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్ ఆదేశాలతో మాజీ ఎంపీటీసీ సభ్యులు శెట్టిబత్తుల వీరబాబు,యువ నాయకుడు శెట్టిబత్తుల నాని బాబుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు,కార్యకర్తలు, మహిళలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే సత్యప్రభకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 200 మందికి పైగా మహిళలకు చీరల పంపిణీతో పాటు ప్రజలకు చెరుకు రసం పంపిణీ



చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న సేవలను కొనియాడుతూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు,మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు,ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని, కూటమి నాయకులు అంబటి బుజ్జి,గోపిశెట్టి శ్రీను,యర్రాబత్తుల గోవింద్ నాయుడు,మూరా చంటిబాబు,పోలిశెట్టి శ్రీనివాస్, రావూరి తాతాజీ,మదినే దొరబాబు,జెడ్డా రాజేంద్ర,మూరా రాణా,కడుగుల నాగేంద్ర పాల్గొన్నారు.



# స్మశానాలకు శ్రమదానం చేసిన మంత్రి



**పాలకొల్లు, (వజ్ర భారతి) న్యూస్ మే 25మండలం:** లంకలకోడేరు, భగ్గేశ్వరం గ్రామాల స్మశాన వాటిక అభివృద్ధి పనులకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు, స్మశాన వాటిక అభివృద్ధి పనులలో గ్రామస్తులతో కలిసి శ్రమదానం మంత్రి. భగ్గేశ్వరం స్మశాన వాటికకు ఓఎన్జిసి సిఎస్ఆర్ నిధులు 15 లక్షలు తో పనులు చేయనున్నారు, లంకలకోడేరు స్మశాన వాటికకు రూ 50 లక్షలు మెగా సంస్థ నుండి ఖర్చు చేయనున్నట్లు మంత్రి తెలిపారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గొడ్డలి పార్టీ భూతాన్ని భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి శ్రీరామరక్ష. సేవతో ముడిపడి ఉన్న రాజకీయాల్లో కొనసాగటానికి వైకాపా గొడ్డలి పార్టీకి అర్హత లేదు. ఐదేళ్ల వైకాపా అరాచక పాలనలో.. రాష్ట్రం అధోగతి పాలు అయి ప్రగతి పాతికేళ్లు వెనక్కి పోయింది. గత పాలనలో సంపద సృష్టి లేకపోగా ఉన్న సంపద ఆవిరి అయిపోయి రాష్ట్ర అప్పుల పాలైపోయింది. ప్రభుత్వాస్తులు తాకట్టు పెట్టి ప్రైవేట్ ఆస్తులు లాగేసుకోవడమే గత పాలన విధానం. టన్నుల టన్నుల అబద్ధాలు తమ అవినీతి కరపత్రికలో అచ్చోసి గొడ్డలి పార్టీ కూటమి ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నం చేస్తుందని మంత్రి అన్నారు, ఈ కార్యక్రమంలో పాలకొల్లు తహసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, టిడిపి మండల అధ్యక్షుడు పాముల రజనీకుమార్, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి బాబు, తదితరులు పాల్గొన్నారు,

## ఎమ్మిగనూరు సోమ్మప నగర్ జడ్పీ హైస్కూలులో అక్రమ వసూళ్లకి పాల్పడిన... హెచ్ఎం శకుంతల దేవి

**అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న హెచ్ఎం శకుంతల దేవిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేసిన... ఆర్పీఎస్ఎఫ్ నాయకులు**

**గతంలోనూ హెచ్ఎం శకుంతల దేవి అక్రమా వసూలు చేసినట్టు ఆరోపణలు.**





**ఎమ్మిగనూరు మే 25, వజ్రభారతి ( కర్నూల్ జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక సోమ్మప్ప నగర్ జడ్పీ హైస్కూలులో హెచ్ఎం శకుంతల దేవి పదో తరగతి విద్యార్థుల నుంచి అదనపు పరీక్ష ఫీజు, టీసీ పేరుతో రూ. 300–400 వసూలు చేస్తున్నారని ఆర్పీఎస్ఎఫ్, పీఆర్ఎస్వైఎఫ్ నాయకులు ఆరోపించారు. తహశీల్దార్ శ్రీనివాసులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రఘునాథ్, షాహిద్ ఆఫ్రిదిలు మాట్లాడుతూ, గవర్నమెంట్ స్కూల్ పేద విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం దారుణమన్నారు. గతంలో కూడా హెచ్ఎం అక్రమ వసూవులకు పాల్పడినట్లు వార్తలలోను వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయని, తక్షణమే విచారణ జరిపి హెచ్ఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ శాఖ ఉన్నతాధికారులపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆగ్రహం.

**మార్టేరు ఎస్సీ కాలనీలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్ల అమలుపై అధికారులను ప్రశ్నించి మంత్రి గొట్టిపాటి**

**పీఎం సూర్యఘర్ పనులపై మంత్రికి తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులు**



**ఆచంట, వజ్రభారతి, మే 25:** అధికారులు తప్పుడు సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి గొట్టిపాటినర్సాపురం డీఈ, ఆచంట ఏడీ లకు చార్జీ మెమోలు ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించిన మంత్రి గొట్టిపాటి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం అనంతరం ప.గో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష సమావేశం పీఎం సూర్యఘర్ పనులు నత్తనడకన సాగుతుండడం పై అసహనం వ్యక్తం చేసిన మంత్రి గొట్టిపాటి సోలార్ రూఫ్ టాప్ నిర్మాణ పనుల్లో జాప్యం పనికిరాదని హెచ్చరించిన మంత్రి గొట్టిపాటి సోలార్ రూఫ్ టాప్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారులను మందలించిన మంత్రి గొట్టిపాటి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికపీఎం సూర్యఘర్ టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులతో సమావేశమైన మంత్రి గొట్టిపాటినిబంధనలకు అనుగుణంగా సూర్యఘర్ కనెక్షన్లు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించి మంత్రినిర్ణీత గడువులోకా లక్ష్యాన్ని చేరుకోవాలంటే కనీసం రోజుకు 400 పైగా కనెక్షన్లు పూర్తి చేయాలిగుత్తేదారులు అదనపు సిబ్బందితో పని చేయించి లక్ష్యాన్ని పూర్తి చేయాలి సూచించిన మంత్రి గొట్టిపాటి సూర్యఘర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని గుత్తేదారులను మంత్రి గొట్టిపాటి ఆదేశం గుత్తేదారులు సమయానికి కనెక్షన్లు పూర్తి చేయకపోతే డిస్కంలపై ఆర్థిక భారం పడుతుంది సూర్యఘర్ పథకం అమలులో నిర్లక్ష్యం వహించిన గుత్తేదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన మంత్రి గొట్టిపాటి.

# రాష్ట్రంలో కాల్ సెంటర్లు ఏర్పాటుకు సన్నాహాలు

**విద్యుత్ సరఫరాలో సమస్యలు పరిష్కరించడానికి చర్యలు.. వేల్పూరులో అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న మంత్రి**





**తణుకు, వజ్రభారతి, మే 25:** వేసవి ప్రభావంతో విద్యుత్తు సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలను పరిష్కరించడానికి కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా తణుకు మండలం వేల్పూరు గ్రామంలో వేంచేసిన 45 అడుగుల అభయాంజనేయ స్వామి వారిని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ విగ్రహం వేల్పూరు గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు. అనంతరం మీడియాతో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ఈదురు గాలులు, వేసవి వడగాలులు, అకాల వర్షాలు కారణంగా విద్యుత్ సరఫరాలో అక్కడక్కడ అంతరాయాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఎప్పటికప్పుడు అంతరాయాలను తొలగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్తు వినియోగానికి సరిపడా ఉత్పత్తి అందుబాటులో ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

**సాంకేతిక ఆధారాలతో కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులు**

**అక్రమ సంబంధం నేపథ్యంగా హత్య**

**సీఐ ఎం నాగ దుర్గారావు వెల్లడి**



వజ్రభారతి,స్టేట్,బ్యూరో,మే,25:– కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వార్ఫ్ రోడ్‌లో టిబి ఆస్పత్రి ఎదురుగా ఈ నెల 20న జరిగిన హత్య ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిఐ ఎం నాగ దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ బస్టాండ్ ప్రాంతానికి చెందిన కర్రి చందు(39) అనే వ్యక్తి జువెనైల్ తల్లితో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో జువెనైల్ మరో ఇద్దరి సహాయంతో దాడికి పాల్పడ్డాడు. రాయితో కొట్టి చంపినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో జువెనైల్‌తో పాటు ఫ్రేజర్‌పేటకు చెందిన బర్నికల లక్ష్మణరావు అలియాస్ లక్ష్మణ్ అలియాస్ (కడపోదు)(24), వెంకటేశ్వర కాలనీకి చెందిన పంతాడి లక్ష్మణ్(24)లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి,సాంకేతిక ఆధారాలు,డాగ్ స్క్వాడ్,క్లూస్ టీం సహాయంతో కేసును ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించిన వన్‌టౌన్ సిఐ ఎం నాగ దుర్గారావు మరియు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# లక్ష్మి నాయుడు మెమోరియల్ ఎస్పిఎల్ సీజన్-7 క్రికెట్ పోటీల విజేతగా నాయుడు లైన్స్...

**విజేతలకు బహుమతులు అందించిన కుంద్రపు నాని దంపతులు..**





**శంఖవరం, వజ్రభారతి ప్రతినిధి. ముఖే. వీరబాబు మే :- 25 :** మండల కేంద్రం శంఖవరం గ్రామ శివారున గల క్రీడా మైదానంలో కుంద్రపు నాని ఆధ్వర్యంలో లక్ష్మి నాయుడు మెమోరియల్ శంఖవరం ప్రీమియర్ లీగ్ సీజన్ 7 క్రికెట్ పోటీలు విజయవంతంగా ముగిసాయి. నాయుడు లైన్స్ జట్టు మరియు సచిన్ బ్లాస్టర్స్ మధ్య ఉత్కంఠ పోరు నెలకొంది. ఈ పోటీలలో 7 జట్లు తలపడగా నాయుడు లైన్స్ జట్టు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచి విజయాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో సచిన్ బ్లాస్టర్స్ జట్టు నిలిచింది. లక్ష్మి నాయుడు మెమోరియల్ శంఖవరం ప్రీమియర్ లీగ్ సీజన్ 7 క్రికెట్ పోటీల కార్యనిర్వాహకులు పోలిమాటి శాంతి భరత్, శికోలు నాగు సమక్షంలో విజేతలుగా నిలిచిన వారికి కుంద్రపు నాని దంపతులు బహుమతులను అందజేశారు. ఈ పోటీలలో బత్తిన శివరాం ఉత్తమ పరుగులు సాధించి ప్రత్యేక స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జై భీమ్ యూత్ సభ్యుడు గునపర్తి అపురూప్, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు శాంతి భరత్, శికోలు నాగు, వ్యాయమ ఉపాధ్యాయుడు పులి రవిశంకర్ మాట్లాడుతూ, వేసవిలో క్రీడా పోటీలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఈ క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వంతో పాటు మంచి స్నేహభావం పెరుగుతుందని, అలాగే సామాజిక సేవా భావాలు అలవడతాయని అన్నారు. ఈ క్రికెట్ పోటీలలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోటీల నిర్వాహకుడు, అంబేద్కర్ వాది కుంద్రపు నాని మాట్లాడుతూ, నా తల్లిదండ్రులను స్మరించుకొని గ్రామ యువతలో ఉత్సాహాన్ని పెంపొంది ంచేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో శంఖవరం ప్రీమియర్ లీగ్ సీజన్ 7 నిర్వాహకులు, గ్రామ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సీ 2026 ఫలితాల్లో రివాల్యూషన్ విద్యార్థిని ఘన విజయం

**591/600 మార్కులతో ఉప్పల శ్రీసాయి స్వాతి ప్రతిభ**

**వాసవి పెనుగొండ,వజ్రభారతి, మే 25:** 2026 ఎస్ఎస్సీ ఫలితాల్లో రివాల్యూషన్ ద్వారా ఆక్స్ఫర్డ్ స్కూల్ విద్యార్థిని ఉప్పల శ్రీసాయి స్వాతి 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ముఖ్యంగా సైన్స్ విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా విద్యాసంస్థ కరస్పాండెంట్ కొమ్ములు రామకృష్ణ మాట్లాడుతూ, "విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగితే ఉన్నత ఫలితాలు సాధించడం సాధ్యమేనని స్వాతి నిరూపించింది. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ముఖ్యమని" తెలిపారు. భవిష్యత్తులో కూడా సంస్థ నుంచి మరింత మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జామిమా, పదవ తరగతి ఇంచార్జ్ అశోక్, ఇంచార్జ్‌లు గిరిజా వాణి, జాహ్నవి తదితరులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.






## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం..

**నిరుపేదల పక్షాన "మన ఊరు – మన బాధ్యత " ఫౌండేషన్...**

**శంఖవరం, వజ్రభారతి ప్రతినిధి. ముఖే. వీరబాబు మే :- 25 :** నిరుపేదల పక్షాన సహాయాలు అందించడానికి యువత ముందుకు రావాలని "మన ఊరు – మన బాధ్యత" ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా శంఖవరం స్థానిక అంబేద్కర్ కాలనీలో ఆర్ల రాజుబాబు మరియు బత్తిన రత్న కుమారి మృతి చెందగా వారి కుటుంబాలను " మన ఊరు – మన బాధ్యత" ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు 25 కేజీల రైస్ బాగ్, రూ. 1000/– నగదు అందజేశారు. ఈ సందర్భంగా " మన ఊరు – మన బాధ్యత " ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, అంబేద్కర్ కాలనీలో గల నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఫౌండేషన్ ద్వారా సహకరిస్తున్న యువత కు ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడపాటి మణిబాబు, గునపర్తి అపురూప్, బడే డేవిడ్ రాజు, రాయి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## కర్నూలు ఎస్పీ పబ్లిక్ గ్రీవెన్స్‌లో 129 ఫిర్యాదులు

**కర్నూల్ మే 25, వజ్రభారతి ( జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 129 ఫిర్యాదులు అందాయి. ఉద్యోగం పేరుతో రూ.4 లక్షల మోసం, హోమ్ లోన్ మోసం, కూరగాయల బంకు ఆక్రమణ, ట్రాక్టర్ తీసుకొని పరార్, ఇంటి ఆక్రమణకు యత్నం, భూమి అమ్మకాల్లో మోసం వంటి ఫిర్యాదులు వచ్చాయి. అన్ని ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

## శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు



**పాలకొల్లు, (వజ్ర భారతి) న్యూస్: మే 25.:** పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు సోమవార ఏడు మారేడు దళములతో మాడ వీధులలో సప్తసోమవారముల సప్త ప్రదక్షిణాలు యందు సుమారు 270 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు ,ఆలయ ప్రధాన అర్చకులు కిష్టప్ప , సూపరింటెంట్ పి. వాసు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. రాత్రి 7.00లకు దూప సేవ రాత్రి 7.30 ని. ములకు శ్రీ స్వామి వారి పంచాహారతుల సేవ నిర్వహించారు, భక్తుల సౌకర్యార్థం కార్యనిర్వాహణాధికారి ముచ్చెర్ల శ్రీనివాసరావు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు.

## పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం, వజ్రభారతి, మే 25:** భీమవరం 19వ వార్డు కు చెందిన మాగపు భగత్ సింగ్ తల్లి గౌరమ్మ ఇటీవలే మృతి చెందారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబా బు) భగత్ సింగ్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని తెలియజేశారు. భీమవరం మండలం బేతపూడి గ్రామానికి చెందిన వీరమల్లు సూరిబాబు వారి తల్లి ఇటీవలే మృతి చెందారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని తెలియజేశారు.

## అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకున్న డా.నల్లగండ్ల అశోక్ కుమార్ పటేల్

**వరల్డ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది**

**డా.నలగండ్ల అశోక్ కుమార్ పటేల్ ఎల్లంకి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నర్సాపూర్**




**జిన్నారం మున్సిపల్, మే 25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ లో మయూరి సంస్థ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ -- అచీమ్మెంట్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, అమెరికా ఎన్ఆర్ఐలు, సినీ సామాజిక రంగ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాలతో విశేష సేవలు అందిస్తూ ప్రముఖ సామాజిక సేవా నాయకుడిగా గుర్తింపు పొందిన డా.నల్లగండ్ల అశోక్ కుమార్ పటేల్ కి అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ అచీమ్మెంట్ అవార్డు ప్రదానం చేశారు. గతంలో కూడా డాక్టర్ నలగండ్ల అశోక్ కుమార్ పటేల్ చేస్తున్న సేవలను గుర్తించి బెంగళూరు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది,పలు సంస్థలు ఇది సేవలను గుర్తించి రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి అవార్డ్స్ ప్రధాన చేయడం జరిగింది,ఈ సందర్భంగా డాక్టర్ నలగండ్ల అశోక్ కుమార్ పటేల్ మాట్లాడుతూ,విద్యార్థి దశ నుండి నేటి వరకు నిరంతరం సామాజిక సేవలను తలపెడుతున్నందున నా సేవలను గుర్తించి, నేడు అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్, మయూరి అచీమ్మెంట్ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని అందజేసిన మయూరి సంస్థ అధినేతలు మయూరి రాధ, దత్తుకు ప్రియ లకుప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో మరింత బాధ్యతతో సామాజిక సేవా కార్యక్రమంతో ప్రజా శ్రేయస్సు నిమిత్తం ప్రజా సేవకుడిగా సమాజం గర్వించే విధంగా కార్యక్రమాలతో కొనసాగుతానని పేర్కొన్నారు. నా విజయాలకు నా వెన్నంటూ ఉంటూ నిలిచి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు,గురువులకు, మిత్రులకు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్న అన్నారు.

# ఎమ్మెల్సీగా రెండుసార్లు మంత్రి నిమ్మల సహకారం మరువలేను..

**మాది అన్నదమ్ముల అనుబంధం- మాజీ ఎమ్మెల్సీ అంగర స్పష్టం**



**పాలకొల్లు,( వజ్ర భారతి) మే 25:** ఎమ్మెల్సీగా తనకు రెండుసార్లు అవకాశం వచ్చిందంటే మంత్రి నిమ్మల రామానాయుడు సహకారం మరువలేనిదని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ స్పష్టం చేశారు. పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నిమ్మల తనను అనగదొక్కేస్తున్నారంటూ వైసీపీ నాయకుడు మేకా శేషుబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మా మధ్య ఎటువంటి విభేదాలు లేవని, మాది అన్నదమ్ముల అనుబంధం అని స్పష్టం చేశారు.మొదటిసారిగా ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించాలని అప్పటి పార్టీ మండల అధ్యక్షుడుగా ఉన్నరామానాయుడు, ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి లు చంద్రబాబు వద్దకు వచ్చి కోరారని, రెండోసారి చంద్రబాబు వద్దకు ఎమ్మెల్యేగా నిమ్మల తీసుకువెళ్లి చెప్పారని గుర్తు చేశారు. మంత్రి నిమ్మల తనను ఎప్పుడూ గౌరవిస్తారని, తాను అదే విధంగా ఉంటానని పార్టీ కార్యక్రమంలో ఇద్దరం కలిసే పాల్గొంటామని అంగర తెలిపారు. చిన్నపాటి రాజకీయ లబ్ధి కోసం మమ్మల్ని విడదీయాలని శేషుబాబు ఇటువంటి చౌకబారు అవాస్తవాలు మాట్లాడడం ఆయన స్థాయికి తగదన్నారు. తెలుగుదేశం పార్టీతో 33 సంవత్సరాల అనుబంధం ఉందని, తన రాజకీయ భవిష్యత్తుకు , వార్డు సభ్యుని నుంచి సర్పంచ్ గా, ఎంపీపీగా, జడ్పిటిసిగా, జడ్పీ ఉపాధ్యక్షులుగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా, శాసనమండలి విప్ గా అనేక పదవులు నిర్వహించాను అంటే టిడిపియే అని అన్నారు. ఆనాటి ఎన్టీఆర్ నుంచి నేడు చంద్రబాబు, యువనేత లోకేష్ లు పేరు పెట్టి ఆప్యాయంగా పలకరిస్తారని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి వాళ్లు ఎప్పటికీ మనుగడ ఉండదనే భయంతో ఈర్ష్యతో మంత్రి నిమ్మలపై అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు తీసుకువచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలందరూ అభివృద్ధిని చూసి సంతోష పడుతున్నారని, మరో 20 ఏళ్లు ఎమ్మెల్యేగా రామానాయుడు గెలుస్తారని అంగర స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిమ్మల అహర్నిశలో కష్టపడుతున్నారని ఆయన నాయకత్వంలో మేమంతా పని చేస్తామన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేనందుకు మీరు సిగ్గుపడాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని, రెండు కళ్ళుగా అమలు చేస్తుంటే జగన్ ఐదేళ్ల పాలన ధ్వంసం విధ్వాసంగా సాగిందన్నారు. పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ మాట్లాడుతూ మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర ల మధ్య విభేదాలు ఉన్నాయని శేషుబాబు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు అవుతుందన్నారు. వైసిపి పార్టీలోనే ప్రతి నాయకుడికి ఒక గ్రూప్ అని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మీ పార్టీ అభ్యర్థికి పనిచేయలేదని జగన్కు ఫిర్యాదు చేసినందు వల్లే పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం మర్చిపోయావా అంటూ ప్రశ్నించారు. మంత్రి నిమ్మల పై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు మాట్లాడుతూ శేషు బాబు తాతాజీలు నడిరోడ్డుపై నువ్వెంత నువ్వెంత అంటూ కొట్టుకున్న విషయాన్ని మీరు మర్చిపోయిన పార్టీ శ్రేణులు, ప్రజలు మర్చిపోలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మామిడి శెట్టి పెద్దిరాజు, గండేటి వెంకటేశ్వరరావు, పాముల రజిని కుమార్, బోనం నాని తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు పెంపొందించాలి

**సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి పిల్లలను గ్రంథాలయాలకు పంపాలి**





**భీమవరం, వజ్రభారతి, మే 25:** ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు పెంపొందించుకోవాలని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. పెనుమంట్ర శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న "వేసవి విజ్ఞాన తరగతులను" సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతులకు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారో, వారికి ఏయే విషయాలను బోధిస్తున్నారో, చదవడం నేర్పిస్తున్నారా అనే అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులతో స్వయంగా చదివించి వారి ప్రతిభను పరిశీలించారు. చదవడం బాగా రాని విద్యార్థులు, కూడపలుక్కుని చదివే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేగంగా చదవడం అలవాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు పద్యాలు, నీతి కథలు చెప్పాలని, కథల్లోని పాత్రలను వారితో నటింపజేస్తే కథలపై ఆసక్తి పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా మెరుగుపడుతుందని తెలిపారు. కథ ముగింపును పుస్తకంలో ఉన్నట్లుగా కాకుండా వేరే విధంగా ఉంటే ఎలా ఉంటుందో పిల్లలతో ఆలోచింపజేస్తే వారి ఆలోచనా శక్తి పరిణతి చెందుతుందని, తద్వారా స్వయంగా ఆలోచించే సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా పిల్లల్లో జిజ్ఞాస పెరుగుతుందని, అదే వారిని సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏడో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు కూడా, సరిగా చదవలేకపోవడంపై జిల్లా కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత విద్యాశాఖ అధికారిని ప్రశ్నిస్తూ పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ఒక వారం రోజులపాటు క్రమబద్ధంగా చదివిస్తే పిల్లలకు చదివే అలవాటు ఏర్పడుతుందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, పెనుమంట్ర శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు డి.కృష్ణారావు, ఎంఈఓ ఉంగరాల నాగేశ్వరరావు, ఎంపీడీవో సిహెచ్.కె వెంకటరెడ్డి, తహసిల్దార్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యాయులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## మల్లికార్జున స్వామి ఆశీస్సులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**అందూర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన**

**పటాన్చెరు నియోజకవర్గం, జిన్నారం మున్సిపాలిటీ, మే 25 (వజ్రా భారతి న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతఅందూర్ గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే**

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అందూర్ కౌన్సిలర్ పర్వతాలు యాదవ్ కుమారస్వామి, స్థానిక గ్రామ ప్రజలు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై కలెక్టర్కు బిజెపి కిసాన్ మోర్చా ఫిర్యాదు

**రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**పటాన్చెరు నియోజకవర్గం, అమీన్పూర్ మున్సిపాలిటీ, మే 25 (వజ్రా భారతి న్యూస్):** సంగారెడ్డి జిల్లా రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్యలపై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టరేట్‌లో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి నాయకత్వంలో రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల పంటలను సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాల్లో సరైన వసతులు లేక రైతులు రోజులు తరబడినిరీక్షించాల్సిన పరిస్థితినెలకొన్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను ప్రభుత్వం వెంటనే మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యరావు, బీరంగూడ డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్, సంగారెడ్డి టౌన్ అధ్యక్షులు వాసు, బాల్రాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.






# అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకున్న జర్నలిస్ట్ జీవ రత్నం

### వరల్డ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది -- జర్నలిస్ట్ జీవ రత్నం

**గుమ్మడిదల మున్సిపల్, మే 25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ లో మయూరి సంస్థ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ -- అచీవ్మెంట్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, అమెరికా ఎన్ఆర్ఐలు, సినీ సామాజిక రంగ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సామాజిక, సాంస్కృతిక పత్రిక రంగాల్లో విశేష సేవలు అందిస్తూ వ్యక్తులను గుర్తించి, అవార్డు పురస్కారాలను అందించడం జరిగింది, అవార్డు పురస్కారాలు ప్రధానోత్స కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడల మున్సిపల్ కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడుగా పత్రికా రంగంలో సమాజ హితం కోరి ఎనలేని కృషిని చేస్తున్న పాత్రికేయుడిగా, గొప్పగుర్తింపు పొందిన జర్నలిస్ట్ జీవ రత్నం కు అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్, మయూరి అచీవ్మెంట్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని అందజేసిన మయూరి సంస్థ అధినేతలు మయూరి రాధ, దత్తుకు ప్రియా లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో పాత్రికేయుడిగా, సామాజిక నాయకుడిగా ప్రజాసేవలో కొనసాగుతానని పేర్కొన్నారు. నా వెన్నంటూ నిలిచి ప్రోత్సహించిన గురువులకు, మిత్రులకు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకున్న జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతి

### వరల్డ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది -- జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతి




**మెదక్ కౌడిపల్లి మండలం, మే 25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా. ఏర్పులశ్రీనివాస్):** హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ లో మయూరి సంస్థ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ -- అచీవ్మెంట్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, అమెరికా ఎన్ఆర్ఐలు, సినీ సామాజిక రంగ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలు అందిస్తూ దళిత ఉద్యమ నాయకుడిగా, పాత్రికేయుడిగా, కళాకారుడిగా గుర్తింపు పొందిన జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతికి అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ అచీవ్మెంట్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ పోతరాజు బిక్షపతి మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని అందజేసిన మయూరి సంస్థ అధినేతలు మయూరి రాధ, దత్తుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో పాత్రికేయుడిగా,సామాజిక సాంస్కృతిక కళాకారుడిగా, దళిత ఉద్యమ నాయకుడిగా ప్రజాసేవలో కొనసాగుతానని పేర్కొన్నారు. తన ప్రయాణంలో వెన్నంటి నిలిచి ప్రోత్సహించిన గురువులకు, మిత్రులకు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# అండూర్ మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జిన్నారం మున్సిపల్, మే25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):**
సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలోని అండూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాలలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు జిన్నారం జి.వెంకటేష్ గౌడ్,కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆది రామకృష్ణ, నాయి కోటి రాజేష్, భీమ్, దేవేందర్, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# దేశ వ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి

### కేంద్ర గనులు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ.

### ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణాలకు 6వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశాం

### రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మరియు పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్







**పెనుమంట్ర/పెనుగొండ, వజ్రభారతి, మే 25:** పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గ పరిధిలోని పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం కేంద్ర గనులు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మరియు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి, పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. ముందుగా పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, రూ.20.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ -- విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంత్రులు ప్రారంభించారు. అనంతరం గరువు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ప్రారంభించారు. అలాగే నౌడూరు సెంటర్ నుండి బ్రహ్మణ చెరువు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. నెగ్గిపూడి గ్రామంలోని ఎస్సీ/ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. తదనంతరం పెనుగొండ మండలంలోని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో నూతన 50 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అదేవిధంగా వడలి నుండి జాతీయ రహదారి-16 వరకు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన డబ్ల్యూబీఎం రహదారిని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరిగాయని, ఇందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. గృహ మరియు వాణిజ్య అవసరాల దృష్ట్యా పశ్చిమగోదావరి జిల్లాలో మరిన్ని సబ్ స్టేషన్లు అవసరమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణాలకు సుమారు రూ.6 వేల కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కట్టుబడి ఉన్నారని, విద్యుత్ ఛార్జీలు పెంచకుండా సేవలు అందించాలనే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత రెండు సంవత్సరాలుగా విద్యుత్ చార్జీలు పెంచలేదని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామని, వినియోగదారుల ఫిర్యాదులకు అధికారులు త్వరితగతిన స్పందించాలని సూచించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు, ఏపీ అసెంబ్లీ ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాల గృహాలకు ఉచిత సోలార్ విద్యుత్ ప్యానెల్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ వర్గాలకు సబ్సిడీతో పాటు అదనంగా రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. మిగతా వర్గాల వారికి కూడా సబ్సిడీతో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో అవసరమైన కండెన్సర్ల మంజూరుకు ఇప్పటికే ఇంధన శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో దాసి రాజు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, ఆచంట నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి.పిచ్చయ్య, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.వెంకటరత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐయినం పూడి శ్రీదేవి, పెనుమంట్ర తహసిల్దార్ రవికుమార్, పెనుగొండ తహసిల్దార్ అనిత కుమారి, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# వెలుగుల నాని ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా జన్మదిన వేడుకలు

### నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాల సందడి


### మహిళలకు చీరలు -- సానిటేషన్ కార్మికులకు బట్టలు -- రోగులకు మజ్జిగ పంపిణీ

### 200 మొక్కల పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు సందేశం

### ఆంధ్ర భద్రాద్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కూటమి నాయకులు









(వజ్రభారతి,స్టేట్ బ్యూరో,మే,25:-): సత్యప్రభ రాజా జన్మదిన వేడుకలు ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. వెలుగుల నాని ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యే జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో ప్రత్యేకంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్ సి )లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న నాయకులు అనంతరం ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్ వర్కర్లకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. సమాజానికి సేవ చేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మజ్జిగ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా చెరుకు రసం పంపిణీ చేసి ప్రజలకు ఉపశమనం కలిగించారు. అలాగే ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూడా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి వారి ఆనందానికి కారణమయ్యారు. సానిటేషన్ కార్మికులకు బట్టలు అందజేసి వారి సేవలను కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశంతో 200 మొక్కలను పంపిణీ చేసి పచ్చదన పరిరక్షణకు పిలుపునిచ్చారు. ఇక ఆంధ్ర భద్రాద్రిలో కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ రాజా ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని దేవుడిని ప్రార్థించారు. ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించి జన్మదిన వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో జరిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సత్యప్రభ రాజా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకురాలిగా ఎమ్మెల్యే ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. జన్మదినాన్ని ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆమె ప్రజాసేవా తత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా యాళ్ల జగదీష్ పాల్గొన్నారు. రాష్ట్ర ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని, కూటమి నాయకులు అంబటి బుజ్జి, గోపిశెట్టి శ్రీను, యర్రాబత్తుల గోవింద్ నాయుడు తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

Printed, Published, Edited & Owned by **PAMMI YEDUKONDALU**, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P.,
Printed at **SRI SATYA OFFSET PRINTERS**, Venkatrama Theater Street, **TADEPALLIGUDEM** - 534 102, West Godavari Dt., A.P. Editor : **PAMMI YEDUKONDALU**



## కళాకారులకు ఇళ్లస్థలాలుమంజూరు చేయించాలని మంత్రి కొండా సురేఖకు వినతి

### ప్రముఖ కళాకారుడు వడ్డె ముదంగుల ఎల్లయ్య

**గుమ్మడల్ మున్సిపల్, మే 25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ,సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించిన కళాకారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ జనచైతన్య కళా సంస్థ కళాకారుల బృందం దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ కాలం నుండి గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజా సమస్యలపై పాటలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరిచామని తెలిపారు. అయినప్పటికీ తమకు ఇప్పటికీ సొంత ఇళ్లు లేక ఇరుకు గదుల్లో అద్దె జీవితాలు గడుపుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.గత 2007 నుండి 2014 వరకు స్థానిక తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అలసిపోయిన కళాకారులకు ప్రస్తుత ప్రజాపాలనలో అయినా న్యాయం జరుగుతుందనే ఆశతో మంత్రి కొండా సురేఖను కలిసి తమ సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు.కళాకారుల సేవలను గుర్తించి అర్హులైన పేద కళాకారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జనచైతన్య కళా సంస్థ అధ్యక్షులు వి.యం. ఎల్లయ్య, కళాకారులు నీరుడి కృష్ణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం మున్సిపాలిటీలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే: గూడెం మహిపాల్ రెడ్డి

### జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్



**జిన్నారం మున్సిపల్, మే 25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్, రాళ్లకత్వ, రాళ్లకత్వ తండా, సోలక్పల్లి, అందూర్, ఇమామ్ నగర్, ఊట్ల, దాదిగూడెం, మంగంపేట, జిన్నారం, జంగంపేట, కొడకంచి, నల్తూరు, కొర్లకుంట వార్డుల్లో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి.. జిన్నారం మున్సిపల్ చైర్మన్ నాకీర్తి జనార్ధన్. నూతనంగా ఏర్పడిన జిన్నారం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, తో పాటు వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు జిన్నారం జి.వెంకటేశంగౌడ్, ఎర్రవల్లి దీన ప్రవీణ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు,మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీనాయకులు జనార్ధన్ గౌడ్, ఏర్పుల లింగం, తోట నర్సింగరావు, బండి శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మేంద్ర గౌడ్, రాజేష్, ఆది రామకృష్ణ, కార్యకర్తలు. ప్రభుత్వ అధికారులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీది మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్: రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు

### ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన హరీశ్ రావు

### రోహిణి కార్తె వచ్చినా ధాన్యం ఇప్పటికీ కళ్లాల్లోనే ఉందని ఆవేదన

### రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్

తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందగించిందని, ఐకేపీ సెంటర్లలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన ఆయన, వరి ధాన్యాన్ని పరిశీలించి అక్కడి రైతుల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన ఘాటు విమర్శలు చేశారు.రైతులకు సాగునీరు, కరెంట్, యూరియా అందించడం దగ్గరి నుంచి పండిన పంటను సేకరించే వరకు ప్రభుత్వం ప్రతి దశలోనూ పూర్తిగా ఫెయిల్ అయ్యిందని హరీశ్ రావు విమర్శించారు. రోహిణి కార్తె ప్రవేశించినా సరే, ఇప్పటికీ ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోవడం, రైతులు ఎండనక వాననక అరిగోస పడటం రాష్ట్ర చరిత్రలో ముందెన్నడూ చూడలేదన్నారు.ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "మొన్నేమో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి, ఇప్పుడు కేవలం 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటాం అనడం ఎంతవరకు సబబు? రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే.. మిగిలిన 30 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలి?" అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం ఆపి, వారి మెడలు వంచైనా సరే ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు."తాలు పెడితే తోలు తీస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సిద్దిపేట నియోజకవర్గంలోనే క్వింటాల్‌కు ఏకంగా 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు.

# జిన్నారం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- రూ.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం • ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- సీసీ రోడ్లు డ్రైనేజీలు తాగునీటి పనులకు శంకుస్థాపన జిన్నారాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం
- జిన్నారం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు త్వరలో అందుబాటులోకి
- అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు• గ్రామాలు తండాలు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి





**పటాన్చెరు నియోజకవర్గం, జిన్నారం మున్సిపాలిటీ, మే 25 వజ్రా భారతి న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలో చేపడుతున్న రూ.15 కోట్ల అంచనా వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. నూతనంగా ఏర్పడిన జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. శివానగర్, రాలకత్వ, తాండా, సోలాకేపల్లిఅందూరు, హిమానగర్, ఒట్లదాదిగూడెం, మంగంపేట్, జిన్నారం, జంగంపేట, కొడకంచి, నల్తూర్, కొర్లగుంట తదితర ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లు తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిన్నారం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం కోసం వెయ్యి గజాల స్థలం.. భవన నిర్మాణం

### అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

### ప్రతి కార్మికుడికి గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు..పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్ చెరువు, మే 25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగానికి కీలకంగా మారిన సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో నియోజకవర్గస్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులు చేయాలని కోరారు. సంఘం సభ్యుల కోరిక మేరకు.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి ఆరోగ్య భద్రతను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి సెంట్రింగ్ కార్మికుడికి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు.. లేనివారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, రాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు యాదగిరి, అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు మంచిది కాదు

### ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి

### హమాలీలు, లారీల కొరత నివారించాలి

### జిన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జిన్నారం మున్సిపల్, మే 25 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్): :** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. వర్షాకాలం ఆరంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందని. అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని.. వెంటనే కొనుగోళ్ళు ప్రారంభించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిన్నారం, సోలక్పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల అంశంలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు వివరించారు. కష్టనష్టాలను ఎదుర్కొని ధాన్యం పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వస్తే.. అధికారుల నిర్లక్ష్యం మూలంగా గత 15 రోజులుగా కొనుగోలు చేయకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షాలు ఎప్పుడు వస్తాయన్న భయాందోళనతో ప్రతిరోజు ధాన్యాన్ని కాపాడుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత పది సంవత్సరాల పాటు రాష్ట్రంలోని రైతాంగానికి స్వర్ణయుగం నడిచిందని అన్నారు. రైతుకి రైతుబంధు, రైతు భీమా, సాగునీరు, పండించిన ప్రతి పంటకు మద్దతు ధర, సకాలంలో కొనుగోళ్లు చేయడంతో పాటు వెంటనే డబ్బులు సైతం డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో వ్యవసాయం అంతంత మాత్రమే ఉందని.. పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మరో వారం రోజుల్లో రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికిని.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు అలాగే ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అర్థం పడుతుందని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు. రవాణా, హమాలీలు, గన్ని బ్యాగుల కొరత పేరుతో రైతులను ఇబ్బందులకు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రోజు నుండే ధాన్య కొనుగోలు చేపట్టాలని జిల్లా పౌరసరఫల శాఖ అధికారికి ఫోన్ లో సూచించారు. రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గంలో రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయడంతోపాటు.. ఇందుకు సంబంధించిన డబ్బులు సైతం డిపాజిట్ చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు జిన్నారం జి.వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

